


*మగధీర సినిమాకి మాతృకగా వివాదాల్లోకి ఎక్కిన నవల.*

*రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ.*

*(గత సంచిక తరువాయి)*

## 2

**సికింద్రాబాద్ స్టేషన్‌లో** లేటుగా రానున్న ఎ.పి.ఎక్స్‌ప్రెస్ రాక కోసం ఎదురుచూస్తోంది ఐశ్వర్య.

గ్వాలియర్ నుంచి తిరిగి రానున్న రూపమతిని ఇంటికి తీసుకెళ్ళాలని వచ్చిందామె.

కళ్ళు చెదరగొట్టే అందంతో స్టేషన్ ప్లాట్ ఫారంపై నుంచున్న ఐశ్వర్యని చూసి మతులు పోగొట్టుకుంటున్నారు పరిసరాల్లోని జనం.

యువకులతో పాటు వయసు మళ్ళినవాళ్ళు కూడా ఆమె పైనుంచి తమ దృష్టిని మళ్ళించుకోలేకపోతున్నారు.

ఆడవాళ్ళు కూడా ఆమె అందాన్నీ, అంతగా ఆభరణాలు లేని ఆమె రూపాన్నీ నోరెళ్ళబెట్టుకుని చూస్తూ ఆశ్చర్యపోతున్నారు.

ప్లాట్‌ఫారంపై తిరుగాడుతున్న కుర్రాళ్ళందరినీ మూగవాళ్ళని చేసేసిందామె.

కుర్రమూకలన్నీ కూడా ఆమెకి దగ్గరగా వెళ్ళకుండా దూరంగానే నుంచుని ఆమె అందాన్ని ఆస్వాదిస్తున్నాయి.

ఇతర సమయాల్లో, ఇతర ఆడపిల్లల ముందూ నానా వెర్రివేషాలు వేసే తుంటరి వాళ్ళంతా తమ గొంతుల్ని కట్టేసుకుని ఆమెనే చూస్తూ ఉండిపోయారు.

ఆమె ఎక్కడ వెళ్ళిపోతుందోనన్న ఆదుర్దాతో అందరి మొహాలూ కంగారుతో కదలాడుతున్నాయి.

ఆ విధంగా పరిసరాల్లోని మనుషుల చలనాల్నీ, మనసుల్నీ కట్టిపడేసిన ఐశ్వర్య తన చుట్టూ నిశ్శబ్దం అలుముకోవటాన్ని గమనిస్తూనే ఉంది.

అది ఆమెకి కొత్తకాదు. తనుఎక్కడికి వెళ్ళినా తనని చూసిన జనం మౌనం వహిస్తూ తననే కనురెప్పలు కూడా వాల్చకుండా చూస్తూ ఉండిపోతారన్న విషయం ఆమెకేనాడో తెలిసిపోయింది.

ప్లాట్ ఫారం పైన ఉన్న కొంత జనం ఆమెని ఏదో సినిమా తారగా తలపోస్తూ ఎవరా అంటూ గుర్తుచేసుకునే ప్రయత్నంలో కూడా మునిగిపోయారు.

"ఎంత గొప్పింటి ఆడపడుచో?" అంటూ కొందరమ్మలక్కలు ముక్కున వేలేసుకున్నారు.

"ఇంతటి అందగత్తే ఇలా వంటరిగా ఎలా వచ్చి నుంచుందో"నంటూ బుర్రలు పాడుచేసుకుంటున్నారు మరికొందరు.

ఆవిధంగా ఓ ఇరవై నిముషాలసేపు ఐశ్వర్య సౌందర్యం అందరినీ ఆకట్టుకుంది.

రైలు వచ్చింది.

రూపమతిని కిటికీలో చూసి చేయూపింది ఐశ్వర్య.

స్టేషన్ లోనుంచి బయటకు వెళుతుండగా ఐశ్వర్య అందం ముందు రూపమతి అందం వెలవెలపోయింది.

అంతా తననే గమనిస్తున్నారన్న విషయాన్ని గుర్తిస్తూనే తన కెనెటిక్ హోండావైపు నడిచింది ఐశ్వర్య.

ఆమె వెళ్ళిపోగానే అక్కడి వెలుగంతా తొలిగిపోయినట్టయ్యింది.

ఇంటికి తీసుకెళ్ళకుండా హుసేన్ సాగర్ టాంక్‌బండ్ వంక బండిని తీసుకువెళుతున్న ఐశ్వర్యవంక ఆశ్చర్యంగా చూసింది రూపమతి.

అల్లూరి సీతారామరాజు బొమ్మముందు బండినాపి ప్రక్కనున్నపచ్చగడ్డపై చతికిలబడింది ఐశ్వర్య.

అది చూసి విసుక్కుంది రూపమతి.

"ఐశ్వర్యా! నేను ప్రయాణం చేసి చాల అలసిపోయి ఉంటానని నీకు తెలుసుకదా! ఇప్పుడిక్కడికి తీసుకొచ్చి కూచోబెట్టడంలో నాకేమీ అర్థం బోధపడడంలేదు" అంటున్న ఆమెవంక చూసి నవ్వింది ఐశ్వర్య.

ఐశ్వర్య నవ్వు వెన్నెలని కురిపించినట్లుగా ఉంది.

"అర్థం చాలావుంది రూపా. ముందు నాకు గ్వాలియర్ విశేషాలు చెప్పు, చందేరీ ఎలా ఉంది? ముఖ్యంగా ఓర్చా" అంటూన్న ఆమెవంక వింతగా చూసింది రూపమతి.

"ఇవడగడానికా నన్నిక్కడికి తీసుకువచ్చింది? నాకు ఓర్చా వెళ్ళేందుకు వీలుపడలేదు. చందేరీ శారీ యాడ్ ఫిల్మ్‌లో మాత్రం పాల్గొన్నానని నీకు మొన్ననే ఫోన్ చేసాను. ఆ అడవిలో షూటింగ్ గురించి చెప్పుకునేందుకు ఏమంత గొప్ప విషయం లేదు" అంటూ మూడుముక్కల్లో విషయాన్ని వెల్లడించేసిన రూపమతిని చూస్తూ దాదాపుగా నీరుకారిపోయింది ఐశ్వర్య.

"రూపా! ఏవి నీ కాళ్ళు?" అంటూ రూపమతి కాళ్ళవంక చూసింది ఐశ్వర్య.

చటుక్కున వంగి తన పాదాల్ని ఆబగా ముద్దుపెట్టుకుంటున్న ఐశ్వర్యని చూసి తెల్లబోయింది రూపమతి.

"రూపా! చందేరీ భూముల్లో తిరిగి వచ్చిన నీ పాదాలు నాకు పుష్పాలు, నీవు కాళ్ళు కడుక్కోకముందే నేను వాటిని ముద్దాడాలి. ఆ పాదాలకు అంటివున్న ధూళిని నేను ఉదహరించాలి" అంటూ రూపమతి పాదాలను తాకుతూ తన శిరస్సుపైన చేతిని విదుల్చుకుంది ఐశ్వర్య.

చాలా రోజుల్నుంచి ఐశ్వర్య వ్యవహారాన్ని అర్థంచేసుకునే ప్రయత్నం చేస్తూనే ఉంది రూపమతి.

ప్రతిక్షణమూ ఓర్చా, చందేరీల గురించి తప్ప ఆమె మాటల్లో మరే విషయమూ దొర్లడంలేదీ మధ్య.

తమ కాలేజీ తరపున ఫిజికల్ ఫిట్‌నెస్ ట్రైనింగ్ కోసం రూపమతి ఎన్నుకోబడిందనీ, గ్వాలియర్‌లో తనో రెండువారాలుండబోతుందనీ తెలిసినప్పటినుంచీ రూపమతి కన్నా ఐశ్వర్యకే ఆనందంగా ఉంది.

"రూపా! ఆ ప్రాంతానికి నేను వెళ్ళలేకపోతున్నా, నీవు వెళుతున్నందుకు నాకెంతో సంతోషంగా ఉంది.. నా కళ్ళని నీ కళ్ళుగా మార్చగలిగే వీలుంటే ఎంత బావుండేదో? కానీ ఆ అదృష్టం నాకు లేదు. అందుచేత నీ కళ్ళనే నా కళ్ళుగా ఉపయోగించు. నీవు తిరిగి వచ్చాక అక్కడ చూసిందంతా నాకు కనిపించాలి. అక్కడి విశేషాలన్నీ నువ్వు నాకు చెప్పాలి"

కదిలిపోతున్న రైల్లోని తన చేతిని నిమురుతూ వీడ్కోలు పలికిన ఐశ్వర్య వంక సజల నయనాలతో చూస్తూ ఉండిపోయింది రూపమతి.

రైలు మలుపు తిరగ్గానే తనేదో కోల్పోయినట్టుగా వెనక్కి తిరిగింది ఐశ్వర్య.

కానీ ఇప్పుడిక్కడ్నుంచి తిరిగి వచ్చాక రూపమతిలో నిర్లిప్తత కనిపించడం చూసి చిన్నబోయిందామె.

రెండువారాలు గ్వాలియర్ ప్రాంతాల్లో గడిపి వచ్చిన రూపమతి తనకెన్నో విశేషాల్ని వివరిస్తుందనుకుంటే అతి నిరుత్సాహంతో తనకెదురయిందామె.

పైగా ఏదో దెబ్బతిన్న వ్యక్తిలా ప్రవర్తిస్తున్న రూపమతిని మరింతగా బాధపెట్టదలుచుకోలేదు ఐశ్వర్య.

తనంటే ప్రాణాల్ని సైతం వదలగలిగే తన స్నేహితురాలీ విధంగా ఎందుకు ప్రవర్తిస్తోందా అన్న ఆలోచనలో జారిపోయిందామె.

గ్వాలియర్‌లో ఆ రాత్రి జియాజీరావు ఎందుకలా ప్రవర్తించాడో బోధపడక హైదరాబాద్‌కు తిరిగి బయలుదేరేదాకా తన బుర్రని పాడుచేసుకుంటూనే ఉంది రూపమతి.

ఆ రాత్రి తనను అతనెందుకు తిరస్కరించాడో తెలుసుకోవాలని లేకున్నా అతన్ని చూసాక తన మనసెందుకు చలించిందో అర్థం చేసుకోవడంకోసం ప్రయత్నిస్తూనే ఉందామె.

ఆ రాత్రి అర్ధాంతరంగా తనకి డబ్బిచ్చేసి చండేరీ గెస్ట్‌హౌస్ నుంచి వెనక్కి పంపించి వేసిన జియాజీరావు ఎందుకలా ప్రవర్తించాడో ఆమెకెంతకూ బోధపడలేదు. కానీ ఆ రాత్రి తను కార్లో బయలుదేరేముందు ఆ బంగళా యాంటీ రూం తలుపు వెనకాలే నిలబడి తనని గమనిస్తూన్న జియాజీరావు రూపమే తనని ప్రశ్నార్థకంతో వేధిస్తూ ఉంది.

తనతోపాటుగా రూపమతి కూడా ఆలోచనల్లోకి జారిపోయినా ముందుగా తేరుకుంది ఐశ్వర్య.

రూపమతి తనని సంతృప్తిపరిచేలా ఏ విషయాల్నీ ఇక తనకు చెప్పలేదనే నిర్ధారణకు వచ్చేసిందామె.

దాంతో దిగ్గున లేచి నిలబడిందామె.

"పద రూపా! ఇక ఇంటికెళదాం" అంటున్న ఐశ్వర్య పిలుపుతో తేరుకుని ఆమెని మౌనంగా అనుసరించింది రూపమతి.

●●●

కోఠి ఉమెన్స్ కాలేజీ ఆవరణలోని లాన్స్‌లో దూరంగా ఓ చెట్టుకింద కూర్చుని ఉంది ఐశ్వర్య అన్యమనస్కంగా.

ఓ పరిపూర్ణ సౌందర్యదేవతకు ప్రతీకగా కూర్చుని ఉన్న ఆమె రూపాన్ని చూస్తూ ఈర్ష్యకు బదులుగా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాయి ఆ కాలేజీలోని ఇతర అమ్మాయిల మనస్సులు.

"మనది కూడా కో-ఎడ్యుకేషన్ కాలేజీ అయివుంటే ఐశ్వర్యని చూసిన కళ్ళతో బాయిస్‌లోని ఒక్కళ్ళకు కూడా మనం కనిపించేవాళ్ళం కాదు."

"ఆడపిల్లలమైన మనకే ఐశ్వర్యం అందం అంత వెర్రెక్కించేస్తుంటే, ఇక మగపిల్లల విషయం వేరే చెప్పాలా?"

" కానీ తనంత అందగత్తెయినా ఆమెలో కించిత్తు గర్వం కూడా లేదు తెలుసా?"

"బట్.. ఎప్పుడూ ఏదో ఆలోచిస్తూ ఉంటుంది."

అలా తన గురించి రోజూ కాలేజీ ఆడపిల్లలు చర్చిస్తూ ఉండడాన్ని వింటూనే ఉంది ఐశ్వర్య.

అలా వినడం తనకు మామూలు విషయం అయిపోయింది.

దాంతో ఆ విషయాల్ని పట్టించుకోవడం మానేసింది. ఆ రోజు లంచ్ సమయంలో ఒంటరిగా కూర్చుని ఉంది ఐశ్వర్య.

తనకు మధ్యాహ్నం క్లాసుల్ని రద్దు చేసారని తెలిసి రూపమతి రాక కోసం ఎదురుచూస్తూ ఉందామె.

రూపమతి వస్తూనే ఐశ్వర్య వంక ఆశ్చర్యంగా చూసింది.

"మనసేమీ బాగోలేదు రూపా! ఇంటికెళ్ళిపోదామా?" అంటున్న స్నేహితురాలి వంక ఇబ్బందిగా చూసింది రూపమతి.

"రెండువారాల తర్వాత వచ్చానుకదా ఐశ్వర్యా! బోలెడంత నోట్స్ రాసుకోవాల్సి ఉంటుందన్న విషయం నీకు తెలియనిది కాదు" అంటు నసుగుతున్న రూపమతిని కనురెప్ప వేయకుండా కాసేపు అలాగే చూస్తూ ఉండిపోయింది ఐశ్వర్య.

అది చూస్తూనే బెంబేలెత్తిపోయింది రూపమతి.

"ఐశ్వర్యా! నన్నలా చూడకు. నీవీ మధ్య అదోలా ప్రవర్తిస్తున్నావు. ఏమవుతోంది నీకు? రోజంతా ఆలోచిస్తూ కూర్చుంటావు. కాలేజీలో ఎవరితో కలవవు. ఎప్పుడూ ఏదో పోగొట్టుకున్న దానిలా ఎందుకలా ఉంటున్నావు? నీ బాధేమిటో నాకు చెప్పు ప్లీజ్"

దాదాపు కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోతున్న రూపమతిని గమనించిన ఐశ్వర్యలో చలనం ఏమీ కనిపించలేదు. నిర్వికారంగానే ఉండిపోయిందామె.

"ఐశ్వర్యా! నాకు సమాధానం కావాలి. నీ మౌనాన్ని ఆ చూపునీ నేను భరించలేకపోతున్నాను."

ఈసారి రూపమతి వంక నిశితంగా చూసింది ఐశ్వర్యం.

"రూపా! నేనొకసారి ఓర్చాకి వెళ్ళిరావాలి. ఎందుకో తెలీదు. కానీ వెళ్ళాలి. అంతవరకూ నేను మామూలు మనిషిని కాను. ఆ చండేరీ భూముల్లో నిలబడి ఓసారి గుండెలనిండా గాలిని పీల్చుకుంటే తప్ప నాకు శాంతి లభించదు."

ఐశ్వర్య చెప్పింది వింటూనే రూపమంతి మనసు తేలికపడిపోయింది. ఇంకా ఏదో పెద్ద విషయం చెబుతుందేమోనన్న భయంతో కొట్టుమిట్టాడిన ఆమె గుండెలు మామూలుగా కొట్టుకోసాగాయి.

"ఓస్ అంతేనా! అంకుల్‌కి చెప్పి నీ ప్రయాణాన్ని వెంటనే ఏర్పాటు చేస్తాను. ఇక నువ్వు నిశ్చింతగా ఇంటికెళ్ళిపో నేను క్లాసుకెళతాను" అంటూ లేచి నిలబడిపోయింది రూపమతి.

అది వింటూనే తాను దిగ్గున లేచి నిలడింది ఐశ్వర్య.

"రూపా! ఆ పని మాత్రం చేయకు. నీవనుకున్నంత సులభం కాదది. ఓర్చాపేరు చెపితేనే నాన్నగారు ఆకాశం అంత ఎత్తున ఎగిరిపడతారు. దాంతో నిన్ను నీవు నిందించుకోవాల్సి వస్తుంది.

అమ్మ చనిపోయినప్పటినుంచే ఆయనకు ఓర్చాపైన విరక్తి పుట్టుకొచ్చింది. అందుకేగా ఉద్యోగాన్ని వదిలేసి ఇక్కడికొచ్చారు. అది మరిచిపోయావా?" అంటూన్న ఐశ్వర్య వంక నిస్సహాయంగా చూసింది రూపమతి.

"సరే ఇహ నువ్వు వెళ్ళు. నేను ఇంటికెళతాను" అంటూ అక్కడి నుంచి వెళ్ళిపోతున్న ఐశ్వర్యవంక అలాగే దిగులుగా చూస్తూ ఉండిపోయింది రూపమతి

రద్దీగా ఉన్న కోఠీ రోడ్డుపై మెల్లగా నడుస్తూ బస్టాప్ వంక వెళుతున్న ఐశ్వర్య ప్రక్కగా వచ్చి తన యమహాని ఆపాడు శ్రీతేజ.

"హాయ్! వాటే సర్ ప్రయిజ్!" అంటున్న ఆ కుర్రాడి వంక నిరాసక్తంగా చూసిందామె.

కానీ మర్యాద కోసం తను కూడా "హాయ్" అంటూ విష్ చేస్తూ ముందుకు కదలబోయింది.

శ్రీతేజ తమ కాలనీలో ఉంటాడన్న విషయం ఐశ్వర్యకు తెలుసు. పైగా తన అందాన్ని ఆరాధించేవాళ్ళలో అతను కూడా ఒకడని ఇంకా బాగా తెలుసు.

ఆ సమయంలో అతను అక్కడికి రావడం కాకతాళీయంగా జరగడం వల్ల అతనిపై విసుక్కోలేకపోయింది ఐశ్వర్య ఆమె ముఖం ఎందుకో చిన్నబోయి ఉన్నట్లు గమనించిన ఆ కుర్రాడు నడుస్తున్న బండిని ఆమెకెదురుగా ఆపాడు.

"ఆర్ యూ ఆల్ రైట్?" కంగారుగా అడుగుతున్న అతనివంక సూటిగా చూడలేకపోయింది.

"బానే ఉన్నాను" అందామె ముక్తసరిగా.

"ప్లీజ్ యాక్సప్ట్ మై లిఫ్ట్" అన్నాడతను.

మరేం మాట్లాడకుండా తన బండిపైనకూర్చుంటున్న ఆమె వంక ఆశ్చర్యంగానూ, ఆనందంగానూ చూసాడు శ్రీతేజ.

ఐశ్వర్య తనకోరికను మన్నిస్తుందని అతనే మాత్రం ఊహించలేకపోయాడు.

బండిని పుల్లీ బౌలీ మీదుగా తిప్పేసి అబిడ్స్‌లోకి రాగానే ఓ సాఫ్ట్ డ్రింక్ షాపు ముందు ఆపాడా కుర్రాడు.

"కోక్ ప్లీజ్" అంటున్న అతనికే సమాధానమూ చెప్పలేదు ఐశ్వర్యం.

"ఏంటలా ఉన్నావు ఐశ్వర్యా?" కొద్దిగా లిబర్టీ తీసుకుంటూ కోక్ అందించాడతను.

"మనసు బాగాలేదు శ్రీతేజ్" అంది ఐశ్వర్య.

"అయితే పిక్చర్‌కెళదామా?" ఆశగా చూస్తూ అడిగాడు శ్రీతేజ.

"ఐ డోంట్ మైండ్" అంటూన్న ఐశ్వర్య వంక నమ్మశక్యం కానట్లుగా చుశాడా కుర్రాడు.

ఆ రోజు తన బండిపై వస్తాననటమూ, తను ఆఫర్ చేసిన సాఫ్ట్ డ్రింక్‌ని తీసుకోవడమే కాకుండా తన వెంట సినిమాకు కూడా వస్తానంటున్న ఐశ్వర్య వంక చూస్తూ హుషారుగా గాల్లో తేలిపోసాగాడతను.

బండిని స్టార్ట్ చేస్తూ "ఏం పిక్చర్‌కెళదాం?" అన్నాడు శ్రీతేజ. మ్యాట్నీవేళ దగ్గర పడుతోండగా తొందరచేశాడతను.

"లాల్ పత్తర్" అంటూన్న ఐశ్వర్య వంక వింతగా చూసాడు ఆ కుర్రాడు.

"అది చాలా పాత ఫిలిం ఐశ్వర్యా! పైగా ఓ డొక్కు హాలులో ఆడుతోంది."

"నాకు తెలుసు కానీ నాకా సినిమా చూడాలని ఉంది" అంటూన్న ఆమె వంక వింతగా చూస్తూ వాడిపోయిన మొహంతో బండిని ముందుకు పోనిచ్చాడు శ్రీతేజ.

హాల్లోకి వెళ్ళాక తనని పూర్తిగా మరచిపోయినట్లుగా ప్రవర్తిస్తున్న ఐశ్వర్య వంక ఇబ్బందిగా చూసాడా కుర్రాడు.

సినిమా మొదలవడం మొదలుకుని చివరిదాకా తన ఉనికినే గమనించనట్లుగా తెరలో లీనమయిపోయిన ఐశ్వర్య ప్రవర్తనని ఏ విధంగా అంచనా వేసుకోవాలో అతనికి తెలీకుండాపోయింది.

ఐశ్వర్య మాత్రం ఎంతో సంతృప్తిగా సినిమాని చూస్తూ కూర్చుంది. తెరపై కదిలిపోతున్న పాత కోటలూ, ప్రాచీన భవనాలూ మొదలగువాటిని వెర్రి ఆనందంతో చూస్తూ ఉండిపోయింది.

●●●

"ఇదిగో హైమవతీ! నేను చాలా సీరియస్‌గా చెబుతున్నాను. నీవు మరోసారిలా చేశావంటే మాత్రం సహించేది లేదు. రూపమతి నీ కూతురే కావచ్చు. కాదనను కానీ అది ఈ ఇంట్లో నా కూతురుతో సమానంగా పెరుగుతోంది. దాని మంచిచెడుల్ని గమనించాల్సిన బాధ్యత నా పైన కూడా ఉంది. ఆ విషయం నీవు గ్రహిస్తే మంచిది" గొంతు చించుకున్నాడు భవానీ ప్రసాద్.

హైమవతి మౌనంగా నిలబడిపోవడం అతనికి నచ్చలేదు.

"ఏం మాట్లాడవేం?" గద్దించాడతను.

భయంగా అతనివంక చూసిందామె.

"ఇంకా ఏం మాట్లాడమంటారు? మీకు తెలీకుండా ఇక ముందు నేను ఏమీ చేయనంటూ ఇప్పటికే పదిసార్లు చెప్పాను. మీరు వినిపించుకుంటేగా?"

తనకు తెలీకుండానే హైమవతి గొంతులో విసుగు ధ్వనించింది.

ఆ విషయాన్ని వెంటనే గమనించాడు భవానీప్రసాద్.

"అదికాదు హైమా" అంటూ మొదలుపెట్టాడతను.

"నేనింతగా ఎందుకు చెబుతున్నానంటే నీకు తెలీనిది కాదు. అన్నపూర్ణ పోయినప్పటినుంచీ నాకా ప్రదేశాల పేర్లని వింటేనే గుండెలు దహించుకుపోతున్నాయి. నా భార్యని పొట్టనపెట్టుకున్న ప్రాంతాలకు నా కూతురే కాదు రూపకూడా వెళ్ళడానికి వీల్లేదని నీకందుకే ఖచ్చితంగా మరీ మరీ చెబుతున్నాను. "

తనింకా అక్కడే అలా నిలుచుని ఉంటే భవానీ ప్రసాద్ ధోరణిలో మార్పు రాదనివెంటనే గదిలోకి వెళ్ళిపోయిందామె.

'చండేరీ, ఓర్ఛా'ల ప్రసక్తి వచ్చినప్పుడల్లా భవానీప్రసాద్ అలా అందరిపైనా విరుచుకుపడిపోవడం ఆ ఇంట్లో ఓ మామూలు విష్యంగా మారిపోయింది.

రూపమతిని కాలేజీవాళ్ళు 'ఫిజికల్ ఫిట్‌నెస్ కోర్సు' 'ట్రైనింగ్‌కి గ్వాలియర్ పంపిస్తున్నారని ముందుగా చెపితే భవానీప్రసాద్ ఎలాగూ ఒప్పుకోడని హైమవతికి తెలుసు. అందుకే కాలేజీ ఆడపిల్లలందరూ కలసి అజంతా - ఎల్లోరాలకు ఎక్స్‌కర్షన్ వెళ్ళారని ఓ చిన్న అబద్ధం ఆడాల్సి వచ్చిందామెకి.

ఉదయాన్నే రూపమతికో ఉత్తరం వచ్చింది.

పోస్టుమాన్ నుంచి దాన్ని తనే స్వయంగా అందుకున్నాడు భవానీ ప్రసాద్. గ్వాలియర్ నుంచి వచ్చిన ఆ ఉత్తరాన్ని కవరు చింపి చదవాలనుకున్నాడు. కానీ అతనిలోని సంస్కారం అందుకు అడ్డువచ్చింది.

అందుకే విషయమేమిటో చెప్పకుండా డొంక తిరుగుడు వ్యవహారాన్ని ఉపయోగించి రూపమతి గ్వాలియర్‌కి వెళ్ళొచ్చిందన్న నిజాన్ని హైమవతి నుంచి రాబట్టుకోగలిగాడు.

గ్వాలియర్ నుంచి వచ్చిన ఉత్తరం హైమవతిలో కలిగిన మార్పుని వెంటనే గమనించాడు భవానీ ప్రసాద్. ఆ ఉత్తరంలో ఏముందో తెలుసుకోకుండానే కంగారుగా అతనికి నిజాన్ని చెప్పేసిందామె.

దాంతో ఉదయం నుంచీ ఆమెని తినేస్తున్నాడతను

చివరకు ఆమె వంటింట్లోకి వెళ్ళిపోయాక ఏం చేయాలో తోచక వీధిలోకి వెళ్ళిపోయాడు భవానీప్రసాద్.

కాలేజీ నుంచి తిరిగి వచ్చాక తల్లి అందించిన ఉత్తరాన్ని చదువుకుంది రూపమతి. గోడ గడియారాన్ని చూస్తూనే ఉలిక్కిపడింది ఆ అమ్మాయి.

ఆ ఉత్తరం చదువుతున్నంతసేపూ కూతురులో కలుగుతున్న మార్పుల్ని గమనిస్తూనే ఉంది హైమవతి.

విషయమేమిటో తనే చెప్పేస్తుందన్న నమ్మకం ఆమెని రూపనేమీ అడక్కుండా చేసింది.

అదే సమయంలో వీధిలోంచి కారు హారన్ వినిపించింది.

గబగబా పరిగెత్తింది రూపమతి.

ఇంటిముందు ఆగివున్న టాక్సీలో కూర్చుని ఉన్నాడు జియాజీరావు.

రూపమతిని చూస్తూనే బండిదిగిపోయాడతను.

జియాజీరావు ఇంట్లోకి నడిచివస్తుంటే రూపమతి గుండెలొక్కసారిగా ఝల్లుమన్నాయి.

తనవంకే చూస్తున్న అతనిలో ఆకర్షణ కాకుండా మరో రకమైన అవ్యక్తమయిన భావం ఏదో తొణికిసలాడుతోంది.

చలనాన్ని కోల్పోయిన రూపముందు నిలబడిపోయాడు జియాజీరావు.

"మే ఐ కమిన్" అంటున్న అతని గొంతుని వింటూనే ఛెంగున పక్కకి తప్పుకుందా అమ్మాయి.

ముందు గదిలోని సోఫాలో చేరగిలబడిపోయిన జియాజీరావు శరీరం నుంచి పరిమళాలు గదినిండా నిండిపోయాయి.

నిలబడివున్న రూపమతిని కూర్చోమంటూ సౌంజ్ఞ చేశాడు జియాజీరావు.

''అయాం సారీ బేబీ! ఆ రోజు జరిగిందానికి నీకు క్షమాపణ చెప్పుకోవాలని వచ్చాను'' అన్నాడతను.

రూపమతి మాట్లాడకుండా అతనివంకే చూస్తూ కూర్చుంది.

ఆ వ్యక్తివంక చూస్తుంటే వికారానికి బదులుగా ఏదో అనురాగం తన వెన్నులోంచి తన్నుకొస్తుండడం ఆమెకి తెలిసిపోతోంది. ఎందుకు జరుగుతోందో ఆమెకి తెలియడంలేదు.

జియాజీరావు పరిస్థితి కూడా అలాగే ఉంది.

రూపమతిని దగ్గరగా తీసుకుని లాలిస్తే బావుండునంటూ అతని గుండెలు కోరుకుంటున్నాయి. అతని ఆ కోరికలో ఆ పిల్లపై శారీరకవాంఛ లేదు.

ఏదో బంధం అతన్నలా చేయమంటూ ప్రోద్భలాన్ని కలిగిస్తోంది అదేమిటో తెలీటంలేదు.

రూపమతి అక్కడ ఎదురుగా కూర్చుని వుంటే ఆమెపై ఏదో అవాజ్యానురాగం పుట్టుకొస్తోందతనికి.

దాదాపు ఓ అయిదునిముషాలసేపు వారిద్దరూ మాట్లాడుకోకుండా ఒకరినొకరు చూసుకుంటూ కూర్చుండిపోయారు.

ఆ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ లోపల్నుంచి హైమవతి పిలుపు వినిపించింది.

''రూపా!''

''అమ్మ పిలుస్తోంది. ఇప్పుడే వస్తాను'' అంటూ లోనికి వెళుతున్న ఆ పిల్లనలాగే చూస్తూ ఉండిపోయాడు జియాజీరావు.

ఓ రెండు నిమిషాల తరువాత మంచినీళ్ళ గ్లాసుతో వెనక్కి వచ్చింది రూపమతి.

''రూపా! ఆ రోజు నిన్ను ముందు చూడకుండా చాలా తప్పుపని చేసాను. నిన్ను నా గదికి రప్పించుకున్నందుకు సిగ్గుతో చచ్చిపోతున్నాను.''

జియాజీరావు గొంతులో నిజాయితీ ధ్వనించింది.

''ఇహ ఆ విషయాన్ని మరచిపోండి సార్'' అని మాత్రమే అనగలిగింది రూపమతి.

ఆమె నోటిగుండా వచ్చిన ఆ పొడి అక్షరాలు జియాజీరావుని సంతృప్తిపరచలేకపోయాయి.

ఆమెనలాగే కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయాడూ.

''రూపా! టీ తీసుకెళ్ళు.''

లోపల్నుంచి మళ్ళీ పిలిచింది హైవతి.

రూపమతి గబగబా లోనికివెళ్ళి ట్రేలో టీని తీసుకుని వచ్చి జియాజీరావు ముందున్న టీపాయ్ పైన ఉంచింది.

జియాజీరావు అప్పుడే తన జేబులోంచి ఓ కవర్ని తీసి ఆమెకు అందించాడు.

ఏమిటా అనుకుంటూ ఆ కవరులోకి చూసిందా అమ్మాయి.

లోపల ఇరవై వేల రూపాయలు. రెండు కొత్త వందనోట్ల కట్టలు కనిపించాయి.

''ఎందుకుసార్?'' అమాయకంగా ప్రశ్నించింది రూపమతి.

''నీవు యాక్ట్‌చేసిన ఫిల్మ్ చాలా బాగా వచ్చింది బేబీ! దాన్ని లండన్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ అప్పారెల్ షోలో ప్రదర్శించాలని నిర్ణయించాం. అందుకే ఈ అధిక మొత్తాన్ని నీకందజేయాలంటూ చండేరీ యాజమాన్యం నిర్ణయించింది'' అన్నాడు జియాజీరావు.

ఈసారి అతని మాటల్లో నిజాయితీ అంతగా ధ్వనించలేదు.

"వద్దు సార్! నేను ఐదువేలకే యాక్ట్ చేయడానికి ఒప్పుకున్నాను. ఆ డబ్బు ఇంకా నా దగ్గరే ఉంది. అమ్మకు ఈ విషయాన్ని ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను. ఇప్పటికే నాకు భయంగా ఉంది. అందుచేత ఆ డబ్బు వద్దు" అంటూ జియాజీరావు ఇచ్చిన కవర్ని వెనక్కి ఇవ్వబోయింది రూపమతి.

అతనందుకు అంగీకరించకుండా దిగ్గున లేచి నిలబడ్డాడు.

"బేబీ! హైదరాబాద్‌లో నేనింకా ఓ మూడు రోజులుంటాను. రేపు సాయంత్రం కంట్రీ కాజిల్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎన్నుకునే 'మిస్ చందేరి' పోటీని ఏర్పాటు చేసాము. నీవు మాత్రం ఆ పోటీలో పాల్గొనడం నాకిష్టం లేదు. గెస్ట్‌గా మాత్రం తప్పక రావాలి. నీకోసం ఎదురు చూస్తాను" అంటూ గబగబా వీధిలోకి వెళ్ళిపోతున్న జియాజీరావు వంక దెబ్బతిన్నదానిలా చూస్తూ ఉండిపోయింది రూపమతి.

తననామె సాగనంపడం కోసం వస్తుందేమోననుకుంటూ కార్లో కూర్చుని ఓ రెండు నిముషాలు చూసి తర్వాత వెళ్ళిపోయాడు జియాజీరావు. అతనున్నంతవరకూ తన మనసులో కలిగిన అలజడికి అర్థం తెలీని రూపమతి మనసు మాత్రం తనని తను ప్రత్యేకంగా 'మిస్ చందేరి' పోటీల్లో పాల్గోవద్దని చెప్పడంతో బాగా నొచ్చుకుంది.

వెంటనే ఆమెకి గ్వాలియర్ లోని తనున్న హోటల్‌లోకి వచ్చినప్పుడు చందేరి ఫిల్మ్ అసిస్టెంట్ డైరెక్టర్ పాండే అన్న మాటలామె చెవుల్లో మార్మోగాయి.

"మీరో గొప్ప అందగత్తె అనుకుని నేను మిమ్మల్ని సెలెక్టు చేయలేదు. మీ ఫిజిక్ అంటే మీ బాడీ బ్యూటీ, మీ ఒంపుసొంపులు మాత్రమే మాకు కావాల్సి వచ్చాయి."

అంటే తను అందగత్తె కాదనేగా అర్థం?

అందుకేగా ఇప్పుడూ వచ్చి వెళ్ళిన జియాజీరావు తనని ఆ 'మిస్ చందేరి ఆంధ్రప్రదేశ్' పోటీల్లో పాల్గొనవద్దని చెప్పింది?

ఒక్కసారిగా తన శరీరం వంక చూసుకుంది రూపమతి.

స్త్రీతత్వానికి పూర్ణ ప్రతీకలా కనిపిస్తోంది తన శరీరం.

కానీ తన మొహమా?

అద్దంలో తన ముఖాన్ని చూసుకోవాలంటేనే భయం వేయసాగిందామెకి.

పాండే అన్న మాటలింకా ఆమె చెవుల్లో ధ్వనిస్తూనే ఉన్నాయి.

దాంతో విపరీతమైన తలపోటు ప్రారంభమైంది.

తన చేతిలో ఉన్న ఇరవైవేల రూపాయలున్న కవర్ని గబగబా తీసుకెళ్ళి వార్డ్ రోబ్‌లోని తన దుస్తుల మధ్య దాచేసింది రూపమతి.

అప్పుడే తన ఇంటిముందు యమహా ఆగింది.

లాల్ పత్తర్ సినిమా నుంచి వచ్చింది ఐశ్వర్య.

ఐశ్వర్యని ఇంట్లోదాకా దిగబెట్టడం కోసం వచ్చాడు శ్రీతేజ.

లోనికొస్తూనే కళావిహీనంగా ఉన్న రూపమతి వదనాన్ని గమనించింది ఐశ్వర్య.

"ఏం జరిగింది రూపా? అలా ఉన్నావే?" అంటూ అడుగుతూనే శ్రీతేజని కూర్చోమంటూ సంజ్ఞ చేసిందామె.

ఐశ్వర్యనిచూడగానే తన ఆలోచనలన్నింటికీ స్వస్తి చెప్పేసింది రూపమతి.

తన గురించి ఆలోచించడం మానేసి ఐశ్వర్య గురించి ఆలోచించసాగిందామె.

"ఐశ్వర్యం ఈ మధ్యకాలంలో చాలా బాధపడుతోంది. రోజా `చండేరీ.. ఓర్హా` అంటూ కలవరిస్తూనేఉంది.

అలాంటి ఐశ్వర్యని మిస్ చండేరీ ఆంధ్రప్రదేశ్ పోటీలో పాల్గొనేలా చేస్తే సరి. అది తన ప్రాణానికి ప్రాణ సమానమైన స్నేహితురాలికి ఎంతో ఆనందాన్ని కలిగించినట్టవుతుంది" అంటూ ఓ నిర్ణయానికి వచ్చింది రూపమతి.

రూపమతి చెప్పింది వింటునే ఐశ్వర్య ఆనందంతో ఆమెను కౌగిలించుకుంది.

ఆమె చెప్పేదంతా విన్న శ్రీ తేజ తనంతట తానుగా వెళ్ళి ఐశ్వర్య పేరుని ఎంట్రీ రిజిస్టర్‌లో నమోదు చేస్తానని ముందుకు వచ్చాడు.

*(కొనసాగింపు వచ్చేసంచికలో)*

Post your comments